క్లుప్తంగా

ఘనంగా కొండేపమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కొండేపమ్మ తల్లి

కొండపి: స్థానిక కామేపల్లి రోడ్డులోని కొండేపమ్మ దేవస్థానం 17వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకుడు కాశేశ్వరశర్మ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు అమ్మవారి భజనలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు దేవస్థానం నిర్వాహకులు గుర్రం ప్రసాదరావు కుటుంబ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అన్నదానం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన కొండపి సీఐ



పాండురంగారావు

కొండపి: కొండపి నూతన సీఐగా నియమితులైన పాండురంగారావు బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. బాధితులు న్యాయం కోసం నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారిస్తానని తెలిపారు. నూతన సీఐని సర్కిల్ పరిధిలోని ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి



రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీటీ చెంచురామయ్య

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్య పేర్కొన్నారు. పొన్నలూరులో బుధవారం రేషన్ వాహనాన్ని తనిఖీ చేసి సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డుదారులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. డీటీ మాట్లాడుతూ.. రోజూ ఉదయం 7 నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించి 90 శాతం పైగా కార్డుదారులకు సరుకులు అందించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

పొగాకు సరాసరి ధర రూ.195

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం తుమాడు, జమ్ములపాలెం గ్రామాల రైతులు 909 బేళ్లు తీసుకురాగా 858 కొనుగోలయ్యాయి. 51 బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.195.97 పలికింది. వేలంలో మొత్తం 21 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

కనిగిరి రూరల్: కారు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లిన సంఘటన బుధవారం కనిగిరి సమీపంలోని మాచవరం వద్ద జరిగింది. కర్ణాటక రాష్ట్రం చిక్కమంగుళూరు ప్రాంత వాసులు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి వెళ్తున్నారు. మార్గం మధ్యలో కనిగిరి సమీపంలోని మాచవరం వద్ద కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. కారులోని ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు.

సబ్సిడీపై సెక్స్ సార్టెడ్ సెమన్



రికార్డులు తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ రమేష్‌బాబు

కొండపి: స్థానిక కామేపల్లి రోడ్డులోని పశువైద్యశాలను ఒంగోలు డివిజనల్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎ.రమేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, పశుగ్రాసం విత్తనాలు, మందులు, టీఎంఆర్ దాణా, కృత్రిమ పశుగర్భధారణ తదితర రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1962 అంబులెన్స్, సెక్స్ సార్టెడ్ సెమన్ లాంటి సౌకర్యాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెక్స్ సార్టెడ్ సెమన్‌తో ఆడ దూడలే పుడతాయని, తద్వారా రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. రూ.1650 విలువ గల సెమన్‌ని ప్రభుత్వం సబ్సిడీపై రూ.500కు అందిస్తోందని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎం.రవికుమార్, జూనియర్ వెటర్నరీ అధికారి ఆర్.విజయ్ కుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు

- కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పీసీ పల్లి (కనిగిరి రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీ పల్లి మండలంలోని తలకొండపాడు సచివాలయం పరిధిలోని గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు రోడ్లు, కాలువలు, విద్యుత్, సబ్‌స్టేషన్ ఏర్పాటు తదితర సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసినట్లు వివరించారు. గ్రామాల్లోనే ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, గ్రామ సచివాయాలను ఏర్పాటు చేసి చిన్న చిన్న సమస్యలకు మండల కేంద్రాలకు వెళ్లకుండా రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి తప్పకుండా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్లు అందజేశారు. తొలుత నాగోతు శ్రీకాంత్, కాకునూరి వెంకటేశ్వర్లు, నెలకూర్తి బ్రహ్మయ్య, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య, చెన్నుపాటి అంజి, గునుగుంట్ల వెంకటేశ్వర్లు, నెలకూర్తి మధుబాబు, నెలకూర్తి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జనన్య, చెరుకూరి సతీష్ చౌదరి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం, జీ బొర్రారెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి, గొనుగొంట్ల రవీంద్ర, ఇరిగినేని మాలకొండయ్య, ఓకే రెడ్డి, రమేష్, శీలం సుదర్శన్, సర్పంచ్ పరిమి వెంకట్రావ్, సింగిల్ విండో అధ్యక్షుడు జయరాంరెడ్డి, ఓంకార్‌రెడ్డి, మాలీ, స్థానిక నాయకులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పుట్టమట్టికి పూజలు చేస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో పోలేరమ్మ, బంగారమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠను బుధవారం మొదటిరోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జలాధివాసం, ధాన్యాధివాసం, పుట్టమట్టి, గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమాలను వీక్షించేందుకు గ్రామం నుంచే కాకుండా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. రాత్రివేళ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు భారీగా పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

10 నుంచి మెగా క్రికెట్ పోటీలు

సీఎస్ పురం (పీసీ పల్లి): క్రికెట్ క్రీడాకారుడు దివంగత మహమ్మద్ షఫీ జ్ఞాపకార్థం మండలంలోని డీజీ పేటలో ఈ నెల 10వ తేదీ నుంచి మెగా క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ షేక్ అబ్దుల్ ఖాదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, హ్యాట్రిక్ సిక్స్‌లు, హ్యాట్రిక్ వికెట్లు, హ్యాట్రిక్ ఫోర్‌లు, బెస్ట్ ఫీల్డర్ తదితరాలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 8వ తేదీలోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఆలూరి బాలకొండయ్య (9960049041), జి.సునీల్ (7075911544) నంబర్లను సంప్రదించాలని కోరారు.

వేలం ఆదాయం రూ.8.71 లక్షలు



వేలంలో పాటదారుల పక్కనే కూర్చున్న వానరం

సింగరాయకొండ: ప్రసిద్ధ వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం వివిధ ఐటమ్‌లకు నిర్వహించిన వేలంలో రూ.8.71 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు జెయింట్ వీల్ నిర్వహణకు రూ.8.61 లక్షలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ విక్రయానికి రూ.10 వేలు చెల్లించేందుకు హక్కుదారులు ముందుకొచ్చారని పేర్కొన్నారు .కాగా గత ఏడాది జెయింట్ వీల్ నిర్వహణకు రూ.7.10 లక్షలు, కూల్‌డ్రింక్స్ విక్రయ హక్కుకు రూ.10 వేలు మాత్రమే దక్కాయని తెలిపారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవడానికి, కొబ్బరి కాయలు అమ్ముకోవటానికి సంబంధించి వేలంలో ఎవరూ పాల్గొనలేదని, ఉన్నతాధికారుల అనుమతితో త్వరలోనే వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, యన్నాబత్తిన చిన్నా, రాజు వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

వేలంలో పాల్గొన్న వానరం!

ఏటా వేలాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తుండగా ఈసారి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసారి వేలం ప్రారంభం కాగానే వానరం వచ్చి పాటదారుల పక్కన కూర్చుంది. వేలం ముగిసే వరకు అక్కడే ఉండి ప్రసాదం తీసుకుని వెళ్లిపోయింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పాటదారులు పేర్కొన్నారు.

నర్రావానిపాలెం రహదారి సమస్య పరిష్కారానికి కృషి

- ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

సింగరాయకొండ: మండలంలోని నర్రావానిపాలెం రహదారి నిర్మాణానికి రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు హామీ ఇచ్చారు. స్థానిక పాకల రైల్వేగేటు సమీపంలోని నర్రావానిపాలెం రహదారిని బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. గతంలో ప్రైవేట్ పట్టా భూమిలో రోడ్డు నిర్మించారని, రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా నష్టపరిహారం అందజేసి ఆ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్యవైశ్య నాయకులతో మాజీ మంత్రి శిద్దా

పామూరు: వివిధ రంగాల్లో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. బుధవారం పామూరు వచ్చిన ఆయన.. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు యేల్చూరి బాలకొండలరావు నివాసంలో మండలంలోని ఆర్యవైశ్య ప్రముఖులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను శిద్దా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా స్థానిక కనిగిరి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన నల్లమల జ్యువెలరీషాప్‌ను శిద్దా ప్రారంభించారు. ఆయనను వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్, నల్లమల ఆంజనేయులు, అనిల్, తాళ్లూరి మురళి, గోష్టు రామారావు, పరకోటి చంద్రశేఖర్, పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు సన్మానించారు.

పలుచోట్ల భారీ వర్షం



ముప్పళ్లపాడు వద్ద పొలాల్లో నిలిచిన నీరు



ఉమ్మనపల్లి వద్ద పారుతున్న గుండ్ల వాగు

హనుమంతునిపాడు: మండలంలో బుధవారం గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. హనుమంతునిపాడు, మల్లవరం, పాత మల్లవరం, కూటాగుండ్ల, నరవగోపాలుపురం, దాసళ్లపల్లి, ముప్పళ్లపాడు, వీరరాంపురం, తురకపల్లి, తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్షానికి దోమలేరు పొంగిపొర్లుతోంది. ఉమ్మనపల్లి వద్ద గుండ్లవాగు, ఎర్రవాగులు పారాయి. వాగులు, వంకలు, కుంటలు, చెక్ డ్యామ్‌లకు నీరు చేరింది. వీరరాంపురం ఎస్సీకాలనీలో వీధుల్లోకి నీరు చేరింది.

వెలిగండ్ల మండలంలో...

వెలిగండ్ల: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సూదనగుంట కంకణంపాడు, పాపిరెడ్డిపల్లి, అగ్రహారం, వెలిగండ్ల, మొగళ్లూరు, చందలూరిపాడు, గోకులం, జిల్లలపాడు, రంగనపల్లి, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. కుంటలు చెరువులకు నీరు చేరింది. చెక్‌డ్యామ్‌లు నిండాయి.

నీటి సమస్య పరిష్కారానికి రూ.28.50 కోట్లు

- పొదిలి చిన చెరువు నుంచి గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు నీరు
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి
- సీఎం జగన్ చిత్రపటానికి ఎంపీపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా తాగు, సాగునీటి సరఫరాకు అనుమతులిచ్చిన సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మర్రిపూడి మండలంలో 35 వేల మంది ప్రజలు తాగు, సాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఈ నెల 12న మార్కాపురం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. తన విజ్ఞప్తిని మన్నించి పొదిలి చిన చెరువు నుంచి మర్రిపూడి మండలం గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా తాగు, సాగు నీరు అందించేందుకు రూ.28.50 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. సమస్యపై వేగంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్, అందుకు సహకరించిన బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి ఘాట్ రోడ్ నిర్మాణానికి సైతం అనుమతులు కచ్చితంగా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా, ఈఓఆర్డీ ఎస్‌కే నాగూర్ వలి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా

- కనిగిరి డివిజన్ ప్రభుత్వ ఖాజీ ఆఫీసును ప్రారంభించిన ఎమ్మెల్యే బుర్రా



ప్రభుత్వ ఖాజీ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక బిలాల్ మసీద్ పక్కన కనిగిరి డివిజన్ ప్రభుత్వ ఖాజీ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే బుర్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ముస్లిం మైనార్టీ వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వామ్యులను చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు శాసన మండలిలో సుముచిత స్థానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ అమలు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది పేద ముస్లింలు ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. తనకు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా.. వాటిని లెక్క చేయకుండా అధిగమించి ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం అయిన ఎస్‌కే అబ్దుల్ గఫార్‌ను మున్సిపల్ చైర్మన్‌గా చేశానని ఎమ్మెల్యే చెప్పారు. కనిగిరి డివిజన్ ప్రభుత్వ ఖాజీ పోస్టు కనిగిరికే వచ్చే విధంగా కృషి చేసి సయ్యద్ ఇర్ఫాన్‌ను నియమించినట్లు వెల్లడించారు. ముస్లిం వర్గాలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఖాజీకి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షఫీ ఆజాద్, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళి, డాక్టర్ రసూల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే లతీఫ్, అమీర్‌బాషా, మస్తాన్‌వలి, వార్డు మాజీ సభ్యుడు ఎస్‌కే షరీఫ్, సయ్యద్ నాయబ్ రసూల్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మీరావలి, మన్సూర్, నాగూర్‌బీ, రహిమాన్, నాగూర్‌వలి, జిలాని, భారతి, మసీద్ కమిటీ నాయకులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను డివిజన్ ఖాజీ సయ్యద్ ఇర్ఫాన్ ఘనంగా సన్మానించారు.

పిచ్చిరెడ్డి కుమార్తె వివాహానికి హాజరైన వరికూటి దంపతులు



నూతన వధూవరులతో వరికూటి అశోక్‌బాబు దంపతులు

కొండపి: ఒంగోలులోని సాయి కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి కుమార్తె గౌతమి వివాహానికి పార్టీ కొండపి సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, లక్ష్మీ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యతోపాటు కొండపి నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై వధూవరులను దీవించారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబు తహసీల్దార్ సంజీవరావు కోరారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన నూతన తహసీల్దార్ సంజీవరావును వరికూటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. టంగుటూరులోని జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాల సమస్యలు ఉన్నాయని, త్వరగతిన పరిష్కరించాలని కోరారు. అలాగే మండలంలోని కొంత మంది వీఆర్వోల పనితీరు బాగోలేదని, వారి వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు చింతపల్లి హరిబాబు, పుట్టా వెంకట్రావు, మేదరమిట్ల భరత్‌రెడ్డి, ఏలూరి వంశీ, ఉప్పలపాటి రామరాజు, ఉప్పలపాటి సత్యనారాయణరాజు, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, నల్లూరి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు తాగు, సాగునీరు అందించేందుకు సీఎం జగన్ అనుమతులివ్వడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో మండలంలోని 32 గ్రామాలకు రామతీర్థ రిజర్వాయర్ నీరు అందించాలని అధికారులకు సూచించారు. అలాగే మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిప్పుకుని ఇబ్బంది పెట్టవద్దన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం క్రింద మండలంలో 30 పనులు మంజూరయ్యాయన్నారు. 7 గ్రామాలకు ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి మండలంలో 23 పనులు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ జాలయ్య తెలిపారు. గార్లపేటలో ఇసుక దందాను కట్టడి చేయాలని ఎంపీటీసీ ఆల్లాటిపల్లి కొండారెడ్డి కోరారు. సమావేశంలో తహసీల్దార్ జగదీష్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా, ఈఓఆర్డీ ఎస్‌కే నాగూర్‌వలి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేది లేదు

పామూరు: విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేది లేదని ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి పాలపర్తి మస్తాన్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు యత్నించడాన్ని నిరసిస్తూ స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కును సాధించుకున్నామన్నారు. దీనిని ప్రైవేటీకరించాలని చూస్తే కార్మికులంతా ఆమరణ నిరాహార దీక్షలకు ఉపకరిస్తారని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా వారికి కట్టబెడుతోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి చెరమగీతం తప్పదని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా బుధవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పామూరు బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వై.రవీంద్రబాబు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు బ్యంగి సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీఓ 111తో చుక్కల భూమికి పరిష్కారం

టంగుటూరు: జీఓ 111తో చుక్కల భూమి సమస్యలను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించిందని, తద్వారా మండలంలో 297 రైతులకు 602 ఎకరాల లబ్ధి చేకూరిందని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జీవో 111పై బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో పెండింగులో ఉన్న చుక్కల భూముల జాబితాలను గ్రామ సచివాలయాలల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు. సమావేశంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

పామూరు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మిడసల జ్వాలానరసింహం అన్నారు. మండలంలోని ఇనిమెర్ల రెవెన్యూ పరిధిలోని నర్రమారెళ్ల గ్రామ సమీపంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వివాదాస్పద భూములను బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములు పలు సర్వేనంబర్లలో ఆక్రమణకు గురయ్యాయని గ్రామస్తులు జేసీ శ్రీనివాసులు, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. భూములకు సంబంధించి గత తహసీల్దార్ తయారుచేసిన నివేదిక, ప్రస్తుతం భూమి స్థితి గురించి నివేదికను జిల్లా రెవెన్యూ అధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరగా ప్రవీణ్, వీఆర్వో తిరుపతయ్య, విలేజ్ సర్వేయర్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు కోసం వృద్ధురాలిపై దాడి

కొండపి: మండలంలోని అనకర్లపూడి గ్రామంలో ఓ వృద్ధురాలి ఇంటి పక్కనే నివాసం ఉంటున్న వ్యక్తి డబ్బు కోసం కత్తి కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకోగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమణయ్య తెలిపారు. ఎస్సై రమణయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుంచాల సుబ్బులు ఒంటరిగా ఉంటోంది. పక్కన ఇంట్లో ఉండే మర్రిపూడి వీరయ్య పూటుగా మద్యం తాగి మంగళవారం సుబ్బులు వద్దకు వచ్చి డబ్బు ఇవ్వాలని అడిగాడు. ఈ క్రమంలో కత్తితో, కర్రతో సుబ్బులుపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు స్పందించి క్షతగాత్రురాలిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కుమారుడు కుంచాల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.